క్లుప్తంగా

చెక్‌పోస్ట్ ప్రారంభం



చెక్‌పోస్ట్ వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు

మెట్‌పల్లిరూరల్: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపడుతున్నామని ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ తెలిపారు. జిల్లా సరిహద్దు శివారులోని మెట్‌పల్లి మండలం బండలింగాపూర్ గండి హనుమాన్ ఆలయం వద్ద మంగళవారం అంతర్ జిల్లా సరిహద్దు చెక్‌పోస్ట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వాహనాలను తనిఖీ చేసిన ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికల వేళ మద్యం,నగదు తరలింపు జరగకుండా పటిష్ఠ నిఘా ఏర్పాటు చేశామన్నారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే పంపిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్సై రాములు,సిబ్బంది పాల్గొన్నారు.

ఆహ్వానపత్రికలు అందజేత



ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్న గౌడ నాయకులు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం కండ్లపల్లి, హన్మాజీపేట గ్రామాల గౌడ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 27న నిర్వహించే రేణుకాఎల్లమ్మ తల్లి కల్యాణ మహోత్సవానికి హాజరు కావాలని మంగళవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు ఆహ్వానపత్రిక అందజేశారు.

బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రిక అందజేత

జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ శ్రీ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో ఈనెల 27 నుంచి 30 వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని మంగళవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు ఆలయ కార్యవర్గ సభ్యులు ఆహ్వానపత్రిక అందజేశారు.

వాటర్ ప్లాంట్లలో పరిశుభ్రత పాటించాలి



మాట్లాడుతున్న కమిషనర్ తిరుపతి

కోరుట్ల: పట్టణంలోని వాటర్ ప్లాంట్లలో తప్పనిసరిగా పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో వాటర్ ప్లాంట్ల యజమానులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వాటర్ ప్లాంట్లలో పరిశుభ్రత తప్పకుండా పాటించాలని, శుభ్రమైన బాటిల్స్‌నే ఉపయోగించాలన్నారు. ప్రతీ వాటర్ ప్లాంట్‌లో ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలన్నారు.ప్రజలకు సరఫరా చేసే నీటియొక్క టీడీఎస్ వ్యాల్యూ ప్రతీ రోజు తప్పనిసరిగా పరిశీలించాలని పేర్కొన్నారు. ఐఎస్ఐ లైసెన్స్ లేకుండా వాటర్ ప్లాంట్లు నడుపరాదని హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్, వాటర్ ప్లాంట్ల యజమానులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మాక్ పార్లమెంట్



మాక్ పార్లమెంట్ నిర్వహిస్తున్న విద్యార్థులు

కోరుట్ల: పట్టణంలోని లిటిల్ జీనియస్ హైస్కూల్‌లో విద్యార్థులు నిర్వహించిన మాక్ పార్లమెంట్ ఆకట్టుకుంది. ప్రజాస్వామ్యం, ఎన్నికలు, ప్రజాప్రతినిధులను ఎన్నుకోవటం, ప్రభుత్వ ఏర్పాటు, పార్లమెంట్ నిర్వహణ వంటి అంశాలపై విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. అనంతరం మాక్ పోలింగ్, మాక్ పార్లమెంట్ నిర్వహించారు. విద్యార్థులు ప్రధానమంత్రి, ప్రతిపక్ష నాయకుడు, స్పీకర్ వేషధారణలో నిర్వహించిన మాక్ పార్లమెంట్ ఆకట్టుకుంది. కార్యక్రమంలో కరస్పాండెంట్ బండి మహాదేవ్, ప్రిన్సిపాల్స్ రాధాకృష్ణ, వినోద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెండో రోజు ప్రశాంతంగా పరీక్ష

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలంలో పదో తరగతి పరీక్ష కేంద్రాలు మూడు ఉండగా రెండో రోజు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. కల్లెడ సెంటర్‌లో 87 మంది విద్యార్థులకు గాను 87 మంది పరీక్షలు రాశారు. పొలాస సెంటర్‌లో 159 మందికి గాను 158మంది పరీక్ష రాశారు. చల్‌గల్ సెంటర్‌లో 90 మందికి గాను 90 మంది పరీక్షకు హాజరయ్యారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మల్లాపూర్‌లో పోషణ పక్వాడపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్, అంగన్‌వాడీ టీచర్లు

మల్యాల: గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో సంపూర్ణ పోషకాహారం లభిస్తుందని జిల్లా అంగన్‌వాడీ టీచర్ల సంఘం అధ్యక్షురాలు రజిత అన్నారు. మండలంలోని తక్కళ్లపల్లిలో మంగళవారం పోషణ పక్షోత్సవాల్లో భాగంగా పోషకాహారం ప్రాధాన్యత వివరిస్తూ, పోషక పదార్థాల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మమత, బాబాయి, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

మల్లాపూర్: గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవడంతో సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ పక్షోత్సవాలపై ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల కోసం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు,ఏఎన్ఎం,ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం ఆత్మకూర్‌లో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ నిర్వహించారు. అంగన్వాడీ టీచర్లు బాలికలకు పలు విషయాలపై అవగాహన కల్పించారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని డబ్బా గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పౌష్టికాహారంపై ఐసీడీఎస్ సూపర్ వైజర్ ప్రతిభ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాణి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

అమ్మవారి దీవెనలతో విజయం



ప్రభుత్వ విప్‌ను సన్మానిస్తున్న నాయకులు

ధర్మపురి: రాజారం ఎల్లమ్మతల్లి అమ్మవారి దీవెనలతో ఎన్నికల్లో విజయం సాధించానని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. రాజారం ఎల్లమ్మ ఆలయంలో జరుగుతున్న విగ్రహ పున: ప్రతిష్ఠ కార్యక్రమానికి మంగళవారం హాజరై పూజలు చేశారు. అనంతరం ఎన్నికల సమయంలో అమ్మవారికి కట్టిన ముడుపును విప్పి మాట్లాడారు. ఆలయ అభివృద్ధికి సహకారం ఉంటుందని తెలిపారు.

నృసింహుడిని దర్శించుకున్న ప్రభుత్వ విప్

ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో మంగళవారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో పాటు నూతనంగా నియమితులైన దేవస్థానం కమిటీసభ్యులతో కలిసి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా బ్రహ్మోత్సవాలను విజయవంతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో దేవస్థానం కమిటీ సభ్యులు, రిటైర్డ్ యూనియన్ అధ్యక్షుడు కమటాల రవీందర్, రాష్ట్ర నాయకులు తొగటి గంగాధర్, కస్తూరి మధుకర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయంలో విప్ పూజలు

జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని లోకమాత పోచమ్మ ఆలయంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఆలయ ప్రతినిధులు, పూజారులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆశీర్వచనాలు అందజేశారు. పాలకవర్గ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్త మోహన్, బల్దియా కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ కల్లెపెల్లి దుర్గయ్య, నాయకులు బండ శంకర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు గాజుల రాజేందర్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ప్రాంతీయ పార్టీలు లేకుండా మోదీ కుట్ర



మాట్లాడుతున్న విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్యేలు

జగిత్యాల: ప్రాంతీయ పార్టీలు లేకుండా చేయాలని మోదీ కుట్ర పన్నుతూ ప్రతి విషయంలో ఈడీని వాడుతున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు అన్నారు. మంగళవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ, ఎమ్మెల్సీ కవిత నిర్దోషి అని, అక్రమకేసులు పెట్టి కావాలనే అరెస్ట్ చేశారన్నారు. అరెస్ట్ రాజ్యాంగ విరుద్ధమని, మోదీ రాగానే వెంటనే ఈడీ వచ్చిందన్నారు. కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ, ఈ కేసులో డబ్బులు చేతులు మారాయనడానికి ఆధారాలు లేవని, దేశంలో ఈడీ కేసుల్లో దోషిగా తేలింది ఇప్పటి వరకు ఒకటి కూడా లేవన్నారు.. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ మోదీ అధికార బలంతోనే ఈడీ అక్రమంగా కవితను అరెస్ట్ చేసిందన్నారు. జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ కడిగిన ముత్యంగా కవిత తిరిగివస్తారన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

శ్మశానవాటికకు స్థలం ఇవ్వాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న రాజ్ కుమార్

కోరుట్ల రూరల్: మండలంలోని అయిలాపూర్‌లో ఆరె కటికె సంఘ భవన నిర్మాణం, శ్మశానవాటిక కోసం స్థలం కేటాయించాలని సంఘ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ గొడికె రాజ్‌కుమార్ మంగళవారం ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌కు వినతిపత్రం సమర్పించారు. అయిలాపూర్ శివారులో గతంలో తమ సంఘానికి శ్మశానవాటిక ఉండేదని దాన్ని కొందరు ఆక్రమించుకున్నారని, ఆ స్థలాన్ని తిరిగి ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు ఆరె కటికె సంఘ నాయకులు పాల్గొన్నారు.

శివాలయంలో ఎమ్మెల్యే పూజలు

ఇబ్రహీంపట్నం: మండలంలోని యామాపూర్‌లో శివాలయంలో కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ప్రత్యేక పూజలు చేశారు. సింగిరెడ్డి తిరుపతిరెడ్డి అనే బీఆర్ఎస్ కార్యకర్త సంజయ్ ఎమ్మెల్యే గెలిస్తే 101 కొబ్బరికాయలు కొడుతానని మొక్కుకోగా, మంగళవారం మొక్కు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎలాల దశరథ్ రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

అయిలాపూర్‌లో క్రికెట్ టోర్నీ ప్రారంభం

కోరుట్ల రూరల్: మండలంలోని అయిలాపూర్‌లో ప్రీమియర్ లీగ్ సీజన్-1 క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు, క్రికెట్ టోర్నీ నిర్వాహకులు పాల్గొన్నారు.

వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు శుభ పరిణామం

కోరుట్ల: రాష్ట్రంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయటం శుభ పరిణామమని రైస్ మిల్లర్ల సంఘం నాయకులు అన్నారు. వైశ్య కార్పొరేషన్ ఏర్పాటును స్వాగతిస్తూ మంగళవారం కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావును సన్మానించారు. వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయటంతో నిరుపేద వైశ్యులకు మేలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో అల్లాడి శ్రీనివాస్, కోటగిరి ప్రసాద్, రేగొండ సత్యనారాయణ, పడిగెల శ్రీనివాస్, లింగా ఉదయ్, వాసవి క్లబ్ అధ్యక్షుడు నేతి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

మల్లాపూర్: ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మండలంలోని పాత దాంరాజుపల్లి శ్రీ మార్కండేయ ఆలయ వార్షికోత్సవంలో పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి సంక్షేమ, అభివృద్ధి ధ్యేయంగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. ఆరుగ్యారంటీలు అమలు చేస్తున్నామన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం మండల అధ్యక్షుడు అయ్యోరి దశరథం, ప్యాక్స్ డైరెక్టర్ కొత్తూరి నారాయణరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రక్షిత మంచినీటి పథకం పునరుద్ధరణకు నిధులు

సారంగాపూర్: బీర్‌పూర్ మండల కేంద్రంలోని భారీ రక్షిత మంచినీటి పథకం పునరుద్ధరించడానికి రాష్ట్ర పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ శాఖ నుంచి రూ. 3.70 కోట్లు మంజూరైనట్లు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం బీర్‌పూర్‌లో మాట్లాడారు. రోళ్లవాగు శివారుల్లో 25 ఏళ్ల క్రితం ఫ్లోరైడ్ రహిత నీటిని అందించడానికి భారీ రక్షిత మంచినీటి పథకం ఏర్పాటు చేసిందని, ఇప్పుడు నిరుపయోగంగా ఉండడంతో దాని పునరుద్ధరణకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కలిసినట్లు తెలిపారు. ఆయన సహకారంతో నిధులు మంజూరైనట్లు తెలిపారు. దీంతో బీర్‌పూర్ మండలానికి శాశ్వత పరిష్కారం లభిస్తుందని, నిధులు మంజూరు. కృషిచేసిన ఎమ్మెల్సీకి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఎంపీపీ మసర్తి రమేశ్, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, విండో చైర్మన్ పొల్సాని నవీన్‌రావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గుడిసె జితేందర్, ఎంపీటీసీ రంగు లక్ష్మణ్, ఆడెపు మల్లీశ్వరి పాల్గొన్నారు.

అజొల్ల,మాగుడు గడ్డి తయారీపై రైతులకు శిక్షణ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న అసోసియేట్ డీన్, ప్రొఫెసర్లు

కోరుట్ల రూరల్: పట్టణ శివారులోని పీవీ నర్సింహారావు వెటర్నరీ విశ్వవిద్యాలయంలో పశు గణన క్షేత్ర సముదాయం ఆధ్వర్యంలో అజొల్లా, మాగుడు గడ్డి పెంపకంపై రైతులకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా విశ్వ విద్యాలయం అసోసియేట్ డీన్ మాధవరావు అజొల్లా పెంపకం ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. పశు గణన క్షేత్ర సముదాయ అధిపతి శ్రీదేవి అజొల్లా పెంపకంలో పాటించ వలసిన పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు నాగరాజు, సౌమ్య, రమ్య, పరశురామ్, శిరీష,తదితరులు పాల్గొన్నారు.

నారీ శక్తి ఐక్యమై బుద్ధి చెపుతారు

కోరుట్ల: దేశంలో నారీ శక్తి ఐక్యమై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి తగిన బుద్ధి చెపుతారని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధికార ప్రతి నిధి నీలి గాయత్రి అన్నారు. మంగళవారం పట్టణంలో మాట్లాడుతూ రాహుల్ గాంధీకి నారీ శక్తి గొప్పతనం తెలియకుండా ఎగతాళిగా మాట్లాడటం సరికాదన్నారు. నరేంద్ర మోదీని దేశ ప్రజలు మరో సారి ప్రధానిగా చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి పూర్ణిమ చౌదరి, నాయకులు పాల్గొన్నారు.

డ్రైవర్ అజాగ్రత్తతో బాలుడు మృతి

మేడిపల్లి: డ్రైవర్ అజాగ్రత్త.. అభం శుభం తెలియని ఓ బాలుడి ప్రాణాన్ని బలిగొంది. అప్పటి వరకు కళ్ల ముందే ఆడుకున్న కొడుకు విగత జీవిగా పడి ఉండటం చూసిన తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించిన ఘటన మేడిపల్లి మండల కేంద్రంలో జరిగింది. స్థానికుల వివరాలు.. మండలకేంద్రం శివారులో నూతనంగా నిర్మిస్తున్న ఓ పౌల్ట్రీ ఫారం వద్ద మహబూబాబాద్ జిల్లా వడ్డెర గూడెం గ్రామానికి చెందిన దంపతులు సంగీత, శ్రీను వారి నాలుగేళ్ల కొడుకు గణేశ్‌ను తీసుకొని కూలీ పనికి వచ్చారు. దంపతులు పనిచేసుకుంటూ ఉండగా బాలుడు పక్కనే ఉన్న గోడ నీడకు కూర్చున్నాడు. అదే పౌల్ట్రీ ఫారంలో డ్రైవర్‌గా పనిచేస్తున్న పెద్దపల్లి జిల్లాకు చెందిన అమరగోని రాజు కాంక్రీట్ మిక్సర్ వాహనాన్ని డ్రైవ్ చేస్తున్న క్రమంలో గోడను ఢీకొంది. దీంతో గోడ కూలి పక్కనే ఉన్న బాలుడి మీద పడడంతో తీవ్రగాయాలలై అక్కడికక్కడే మృతిచెందాడు. బాలుడు తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్యాంరాజ్ తెలిపారు.

వనసంరక్షణలో విద్యార్థులు



రాయికల్: మండలంలోని అల్లీపూర్ శ్రీవాణి టెక్నో స్కూల్ విద్యార్థులు మంగళవారం వనసంరక్షణలో భాగంగా అటవీక్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సెక్షన్ ఆఫీసర్ రవికుమార్ అడవుల ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ అత్తినేని శంకర్, బీట్ ఆఫీసర్ నరేశ్ పాల్గొన్నారు.

ఘనంగా రేణుకాఎల్లమ్మ బోనాలు



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటలో రేణుకాఎల్లమ్మ బోనాలు మంగళవారం గీతకార్మిక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం వేళ భక్తులు బోనాలతో ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లి దేవతకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం ఆలయంలో ఎల్లమ్మ పట్నాలు నిర్వహించారు. ఉత్సవాలకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు, గీత కార్మిక సంఘం సభ్యులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పాలనలో మహిళలకు ప్రాధాన్యం

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్: కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో మహిళలకు ప్రతి పథకంలో మొదటి ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు.సారంగాపూర్ మండల మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా రామడుగు పుష్పలత ను నియమించి, నియామకపత్రాన్ని పుష్పలతకు అందజేశారు.

కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు

సారంగాపూర్ మాజీ ఎంపీపీ కాలగిరి బాపురెడ్డి, రంగపేట తాజా మాజీ సర్పంచ్ బెక్కెం జమున, కోనాపూర్ విండో వైస్‌చైర్మన్ గంగాధరి మంగమ్మ గౌడ్, మ్యాడారంతండా, రంగపేట, ఒడ్డెర కాలనీ గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు జీవన్‌రెడ్డి సమక్షంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు.

నాయీ బ్రాహ్మణులను ఆదుకుంది కేసీఆరే



ఎమ్మెల్యేను కలిసిన నాయీబ్రాహ్మణ నాయకులు

జగిత్యాల: నాయీ బ్రాహ్మణులను ఆదుకుంది కేసీఆరేనని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం నూతనంగా ఎన్నికైన నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సెలూన్ షాపులకు 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించిన ఘనత కేసీఆర్‌దన్నారు. వారి ఆత్మగౌరవం కోసం ప్రతీ చోట భవనాలకు నిధులు కేటాయించామన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పెండెం మహేందర్, కార్యదర్శి శ్రీనివాస్, సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు కిషన్, విజయ్, బాలరాజు, నారాయణ పాల్గొన్నారు.

ఉన్నత చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు

సారంగాపూర్: ఉన్నత చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని, తద్వారా జీవితంలో మంచి స్థితికి చేరుకోవచ్చని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు.సారంగాపూర్ మండలం ధర్మనాయక్ తండా గుగ్లావత్ నీలా కుమారుడు పవన్ కల్యాణ్, కూతురు శిరీష ఇటీవల నిర్వహించిన గురుకుల పాఠశాల టీజీటీ పరీక్షల్లో ఉద్యోగాలు సాధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను వారిని అభినందించారు.

పంటల సాగుకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు, రైతులు

మల్యాల: వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనల ప్రకారం రైతులు పంటల సస్య రక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి చంద్రదీపక్ అన్నారు.మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం వ్యవసాయ శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్‌లో యాసంగిలో కూరగాయల సాగులో చీడపీడల నివారణ, వరి సాగులో మెలకువలు, ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో మంజుల, కారుణ్య, ప్రశాంత్, రైతులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఇబ్రహీంపట్నం: రైతులు ఆయిల్‌పామ్ పంటలలో యాజమాన్య పద్ధతులను పాటించాలని, పంటలలో వచ్చే వివిధ రకాల చీడ, పీడల గురించి శాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్ వివరించారు. మంగళవారం మండలకేంద్రంలోని రైతు వేదికలో విడియో కాన్ఫిరెన్స్ ద్వారా రైతులకు ఆయిల్‌ఫామ్, వరి, వేసవిలో కూరగాయాల పంటలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పొలాస శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ కవిత, మండల వ్యవసాయ అధికారి దీపిక, ఏఈవోలు నరేష్, రవళిక, హరీశ్, శ్యామ్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

గొల్లపల్లి: మండల కేంద్రంలోని రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా,రైతు శిక్షణ కేంద్రం ద్వారా వివిధ పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. పొలాస వ్యవసాయ ప్లాంట్ బ్రీడింగ్ శాస్త్ర వేత్త శ్రీనివాస్ పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో ఏవో కరుణ, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఎంఎస్‌సీసీల రాష్ట్ర యూనియన్ ఉపాధ్యక్షురాలిగా మరియ

జగిత్యాలరూరల్: రాష్ట్ర ఎంఎస్‌సీసీల యూనియన్ ఉపాధ్యక్షురాలిగా బాలె మరియ ఇటీవల నియమితులు కాగా, మంగళవారం ఆమెను ఏపీఎం గంగాధర్, సీసీలు గంగారాం, రవీందర్, విద్యాసాగర్, శ్రీనివాస్, సమైక్య అధ్యక్షురాలు సత్తవ్వ, గంగభవాని అభినందించారు.

గౌడ సంఘం మండల అధ్యక్షుడిగా సాయగౌడ్

రాయికల్: గౌడ సంఘం మండల నూతన కమిటీని మంగళవారం సంఘం నాయకులు ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉత్కం సాయగౌడ్, ప్రధాన కార్యదర్శిగా జోగినిపల్లి తిరుపతిగౌడ్, ఉపాధ్యక్షులుగా కొత్తకొండ లింగంగౌడ్, నాగులమల్లయ్య, కోశాధికారిగా బొంగోని భూమాగౌడ్, ముఖ్య సలహాదారులుగా ముత్తయ్యగౌడ్, అనుపురం శ్రీనివాస్‌గౌడ్, బత్తిని రాజేశం, పాలకుర్తి రవి, దిండిగాల రామస్వామి, వెంకటేశ్‌గౌడ్ ఎన్నికయ్యారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి రెండు రోజుల జైలు

జగిత్యాలక్రైం: అతిగా మద్యం తాగి వాహనం నడిపిపోలీసులపై అనుచితంగా ప్రవర్తించిన వ్యక్తికి న్యాయమూర్తి రెండు రోజులు జైలుశిక్ష విధించినట్లు ట్రాఫిక్ ఎస్సై రాంచంద్రం తెలిపారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని గొల్లపల్లి రోడ్‌లో రెండు రోజుల క్రితం వాహనాల తనిఖీ చేపట్టగా గొల్లపల్లి మండలం శ్రీరాములపల్లికి చెందిన అజయ్ ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షల్లో మద్యం సేవించినట్లు నిర్ధారణ అయింది. మంగళవారం కోర్టులో హాజరు పర్చగా స్పెషల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ కరుణాకర్ అజయ్‌కి రెండురోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

కనుల పండువగా శివపార్వతుల కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మల్లాపూర్: మండలంలోని పాతదాంరాజుపల్లి శ్రీ భక్త మార్కండేయ ఆలయంలో మంగళవారం జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు బల్యాపెల్లి ప్రభాకర్ శర్మ ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. అనంతరం శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం మండల అధ్యక్షుడు అయ్యోరి దశరథం, ఎంపీటీసీ క్యాతం సుజాత, నాయకులు, పద్మశాలీ కుల సంఘ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో వార్షికోత్సవ పూజలు

రాయికల్: మండలంలోని కుమ్మరిపల్లి హనుమాన్ ఆలయంలో మంగళవారం 43వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో అర్చకులు మధుసూదనచార్య ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, హోమం వంటి పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు పారిపెల్లి లక్ష్మీరాజం, సత్యనారాయణ, శ్రీనివాస్, శ్రీధర్,గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

మల్లాపూర్: మండలంలోని రాఘవపేటలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వార్షికోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పల్లకీసేవతో ఊరేగించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఖాదీబోర్డు చైర్మన్, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, ఆలయ కమిటీ వైస్ చైర్మన్ గంధం లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.